క్లుప్తంగా

నేడు కారూరులో జగనన్న సురక్ష శిబిరం

పిచ్చాటూరు: మండలంలోని కారూరు సచివాలయ పరిధిలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న సురక్ష శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరై ప్రజలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని చెప్పారు.

తుంబూరు సచివాలయంలో..

నారాయణవనం: మండలంలోని తుంబూరు సచివాలయంలో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగనన్న సురక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గుణశేఖర్ తెలిపారు.

90 శాతం భూగర్భ విద్యుత్ లైన్ల పనులు పూర్తి


పనులను పరిశీలిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో రూ.17కోట్లతో ప్రారంభమైన భూగర్భ విద్యుత్ లైన్ల పనులు 90 శాతం పూర్తయ్యాయి. సోమవారం ట్రాన్స్‌కో తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి, డిప్యూటీ ఈఈ సతీష్‌బాబు పరిశీలించారు. నాలుగు వీధులకు భరద్వాజ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అవుతుందని. ఏవైనా మరమ్మతులు గురైనపుడు ధర్మరాజుల ఆలయం వద్ద ఉన్న ఉపకేంద్రం నుంచి కూడా లైన్‌ను అందుబాటులోకి రావాలని, ఇది కాకుండా దక్షిణ కైలాసనగర్ విద్యుత్ ఉపకేంద్రం నుంచి కూడా మరొక లైన్ అందుబాటులోకి తెచ్చి నాలుగు మాడవీధుల్లో అనుసంధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిద్దాం


రికార్డులను పరిశీలిస్తున్న భార్గవి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను గుర్తించి పరిష్కరించాలని తహసీల్దారు భార్గవి అన్నారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలను తన దృష్టికి తేవాలని, చెరువుల ఆక్రమణలుంటే అడ్డుకోవాలన్నారు. అనంతరం కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డీటీలు శివయ్య, చంద్రబాబు, ఆర్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని వినతి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

తొట్టంబేడు (శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం కొణతనేరి పంచాయతీలో ఉన్న దళితులు శ్మశానానికి దారి సౌకర్యం కల్పించాలని సోమవారం తహసీల్దార్ ఎర్రం రెడ్డి సుధీర్ రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. సీపీఐ నాయకుడు జనమాల గురవయ్య మాట్లాడుతూ, దళితులు ఎవరైనా చనిపోతే శ్మశానానికి తీసుకువెళ్లడానికి దారిలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి దారి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, హరినాయుడు, ధనంజయులు, ప్రసాద్, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

తిరుపతి కల్చరల్: సచివాలయాల్లో పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని గ్రామ, వార్డు జూనియర్ లైన్‌మెన్ గ్రేడ్-2 సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాజు కోరారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రజల వద్దకే పాలన అనే నినాదంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని తెలిపారు. ఇందులో ఎనర్జీ అసిస్టెంట్‌లను నియమించారని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7 వేల మంది ఎనర్జీ అసిస్టెంట్లు పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఎనర్జీ అసిస్టెంట్లుగా కాకుండా రాష్ట్ర డిస్కంలలో లేని క్యాడర్‌గా జేఎల్ఎం గ్రేడ్-2 పేరుతో 11 కేవీ, 33 కేవీలోని అధిక వోల్టేజ్ లైన్‌లలో పనులు చేస్తున్నామని తెలిపారు. ఇందులో పని చేస్తున్న వారు ఇప్పటికే ప్రమాదవ శాత్తు రాష్ట్ర వ్యాప్తంగా 125 మంది చనిపోయారని వాపోయారు. మరో 250 మంది తీవ్ర గాయాలతో అంగవైకల్యం బారిన పడ్డారని తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదరణ లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఎనర్జీ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు మధు ఆచారి, యగ్నేష్, నరసింహారెడ్డి, శ్రీను, ప్రతాప్ పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాం.. ఆశీర్వదించండి

- దాసుకుప్పం పంచాయతీలో 1,297మందికి పథకాల లబ్ధి రూ.13.46కోట్లు
- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం


దాసుకుప్పంలో మహిళలకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

సత్యవేడు: ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నెరవేర్చారని, అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత నిస్తూ ముందుకెళ్తున్న తమ పార్టీకి వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. మండలంలోని దాసుకుప్పం పంచాయతీలో సోమవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన సంక్షేమ పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. సమస్యలపై ఆరా తీశారు.

దాసుకుప్పం పంచాయతీలో 1297 మంది వివిధ పథకాల రూపేణా రూ.13.46కోట్లు లబ్ధి పొందారన్నారు. విద్యాకానుక 198, వైఎస్సార్ ఆసరా610, వైఎస్సార్ చేయూత 295, జగనన్న అమ్మ ఒడి181, విద్యాదీవెన53, వసతి దీవెన49, జగనన్న తోడు103, వైఎస్సార్ రైతు భరోసా102, వైఎస్సార్ పెన్షన్ కానుక561, జగన్న పేదలకు ఇళ్లు 86 మందికి మంజూరు చేసినట్లు వివరించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

దాసుకుప్పం పరిధిలో అంగన్ వాడీ సెంటర్‌కు భవనం లేక పాఠశాలలో నిర్వహిస్తున్నారు. మరో అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. రెండు అంగన్‌వాడీ భవనాలను ఆధునీకరించాలని పిల్లల తల్లిదండ్రులు కోరారు. ఎస్సీ కాలనీలో మురుగు కాలువలు నిర్మించాలని, ఎస్టీ కాలనీలో విద్యుత్ లైన్లు పొడిగించాలని, దర్గా నుంచి శ్మశానం వరకు కొత్తగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. కాలెమ్మ గుడి, దిగువ ఎస్టీ కాలనీల వద్ద కల్వర్లు నిర్మించాలని మహిళలు కోరారు. వీటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. విద్యుత్ లైను పొడిగించేందుకు, కల్వర్టుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ విజయ వెంకటేష్, ఎంపీడీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు.

గర్భిణులకు సీమంతం

పంచాయతీలో 13 మంది గర్భిణులకు ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి, సీడీపీఓ దేవకుమారితో కలసి ఎమ్మెల్యే సామూహిక సీమంతం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్ కుమార్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏఎంఎం బాలాజీ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రవిరెడ్డి, ఎంపీటీసీ బాలయ్య రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందస్వామి, శరవణన్, ఎంపీ రవి, శ్రీరాములురెడ్డి, శేఖర్, టెంకాయల కృష్ణయ్య, తహసీల్దారు షేక్ జరీనా, సీఐ శివకుమార్ రెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, పంచాయతీ రాజ్ డీఈ మధుసూదన్, వ్యవసాయ అధికారి మురళి, వెటర్నరీ ఏడీ గోవింద భాస్కర్, ఎంఈఓ కే. రవి,ఏపీఓ కృష్ణయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న వలంటీర్లు, పార్టీ నాయకులు

నారాయణవనం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వలంటీర్ల సేవలను కించపరుస్తూ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సోమవారం స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిలో పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని వలంటీర్లు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ ప్రతినిధులుగా తాము పనిచేస్తుంటే పవన్ కళ్యాణ్ కించపరచడం సరికాదని ఖండించారు. ఒకటో తేదీ వేకువ జామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి, పింఛన్లు ఇస్తున్నామని, ఇంటి నుంచి బయటకు రాని వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన సాయం ఎప్పటికప్పుడు అందిస్తున్నామని అన్నారు. పేదలకు సాయం చేస్తున్నామనే సంతృప్తితో తాము పనిచేస్తుంటే పవన్ కల్యాణ్ దురుద్దేశంతో మాట్లాడటం ఎంతమాత్రమూ తగదని నిరసించారు. వీరికి వైఎస్సార్ సీపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. పార్టీ మండల కన్వీనర్ సారకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, వైస్ ఎంపీపీ శివశంకర్ తదితరులు మాట్లాడారు. ఎలాంటి వివక్ష చూపకుండా అన్నివర్గాల ప్రజలకు వలంటీర్లు మంచి చేస్తున్నా వారి సేవలకు వక్రభాష్యం పలకడం శోచనీయమని మండిపడ్డారు. వలంటీర్లకు పవన్ కల్యాణ్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, సర్పంచులు సుబ్రమణ్యంరెడ్డి, గుణశేఖర్, ఎంపీటీసీ రవి, ఉపసర్పంచ్ మురళి, సచివాలయ కన్వీనర్లు మనోహర్, సారకాయలు, మోహన్, ముత్తు, వలంటీర్లు పాల్గొన్నారు.

స్ప్రేయర్లు పంపిణీ


స్ప్రేయర్లను పంపిణీ చేస్తున్న కేవీకే ప్రతినిధులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి మండలం పుల్లారెడ్డి కండ్రిగ దళితవాడలో దళిత రైతులకు రైతులకు సోమవారం రాస్ విజ్ఞాన కేంద్రం వివిధ పంటల్లో సస్యరక్షణ, వినియోగించే పరికరాలు, పనిముట్ల వాడకంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో 20మంది రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లను ఉచితంగా పంపిణీ చేశారు. కేవీకే హెడ్ డాక్టర్ ఎస్ శ్రీనివాసులు మాట్లాడుతూ, కృషి విజ్ఞాన కేంద్రం విధి విధానాలు, కేవీకే వారు రైతుల కోసం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రామ్‌కుమార్, గంగిరెడ్డి, మునిరామిరెడ్డి, రాస్ సిబ్బంది జయలలిత, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్, పాల క్యాన్ల పంపిణీ


మహిళా పాడి రైతులకు పాల క్యాన్లు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

ఏర్పేడు: మండలంలోని ఇసుకతాగేలిలో మహిళా పాడి రైతులకు స్టెయిన్‌లెస్ స్టీల్ క్యాన్లను పంపిణీ చేశారు. సోమవారం ఇసుకతాగేలిలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ 10వ వార్షికోత్సవం నిర్వహించారు. పాడి రైతులకు బోనస్‌తో పాటు, క్యాన్లు, స్వీట్లు అందజేశారు. శ్రీజ కంపెనీ ఏరియా మేనేజర్ చెన్నకేశవరావు, సూపర్‌వైజర్లు మహేశ్వరయ్య, వంశీకృష్ణ, టెక్నీషియన్ తేజ, మహిళా పాడి రైతులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు


ధ్వజస్తంభం వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు


తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ అనితా రామచంద్రన్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషనర్ అనిత రామచంద్రన్ వేర్వేరుగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' లక్ష్యాల సాధనకు కృషి

బుచ్చినాయుడుకండ్రిగ: అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి సైతం లబ్ధి చేకూర్చేందుకు ఉద్దేశించిన జగనన్న సురక్ష లక్ష్యాల సాధనకు అందరూ సమష్టి కృషి చేయాలని ఎంపీడీఓ నరసింహరావు అన్నారు. సోమవారం ఆయన గాజులపెళ్లూరు గ్రామ సచివాలయంలో వలంటీర్లు, సిబ్బందికి జగనన్న సురక్షపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జూలై 25వ తేదీ వరకు మండలంలోని 14 గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్షను నిర్వహిస్తామని, ఈ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటినీ సందర్శించి, జగనన్న సురక్ష సేవల గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. క్యాంపు నిర్వహించే రోజున 11 రకాల ప్రభుత్వ సేవలను సేవా రుసుం లేకుండా ఉచితంగా పొందవచ్చన్నారు. దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గర్భవతులకు వైద్య పరీక్షలు


గర్భవతికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ప్రభుత్వాసుత్రిలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 68 మంది గర్భిణులకు వైద్యాధికారిణి మాధవి, వైద్యులు దివాకర్ వైద్య పరీక్షలు చేశారు. మాధవి మాట్లాడుతూ, గర్భం దాల్చినట్లు నిర్ధారణ అయిన తర్వాత ఏఎన్ఎం వద్ద గర్భవతిగా నమోదు చేసుకోవాలని, క్రమం తప్పకుండా రక్త పరీక్షలు చేసుకుని, రక్త హీనత సమస్య బారిన పడకుండా మందులను వాడాలన్నారు. ఆసుపత్రిలో కాన్పు అయితే జననీ సురక్ష కింద రూ.1000 లు వైఎస్ఆర్ ఆసరా పథకంలో రూ.4000 ఉచితంగా ఇస్తారని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత నాగలాపురం


విన్నర్స్ జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న టోర్నీ నిర్వాహకులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం వేంబాక్కం కబడ్డీ టోర్నమెంట్ విజేతగా నాగలాపురం జైశక్తి జట్టు నిలిచిందని ఆ గ్రామ సర్పంచ్ తెన్నరసు తెలిపారు. రెండు రోజులుగా నిర్వహించిన కబడ్డీ టోర్నీలో ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి 18 జట్లు పాల్గొన్నాయి. సోమవారం ఉదయం ఫైనల్స్ నిర్వహించారు. తుదిపోరులో నాగలాపురం జైశక్తి, కొట్టకాడు జట్లు తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో నాగలాపురం జైశక్తి జట్టు విజేతగా నిలిచింది. విన్నర్స్ జట్టుకు రూ.20 వేలతో పాటు చాంపియన్ కప్, రన్నర్స్ జట్టుకు రూ.15 వేలు, కప్‌ను, తృతీయ బహుమతిగా టీపీ పాళెం జట్టుకు రూ.10 వేలు, 4వ బహుమతిని వేంబాక్కం జట్టుకు రూ.7 వేలను సర్పంచ్ తదితరులు ప్రదానం చేశారు. తమ గ్రామంలో ప్రతి ఏటా కబడ్డీ టోర్నీ నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ చెప్పారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నేత దేశప్పన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో అష్టమి పూజలు


రామగిరి శ్రీ కాలభైరవ క్షేత్రంలో నేతి దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పిచ్చాటూరు: మండలంలో రామగిరిలోని శ్రీ కాళికాదేవి సమేత సంతాన కాలభైరవ స్వామి ఆలయంలో సోమవారం అష్టమి పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సోమవారం నాడు త్రైపుర అష్టమి పర్వదినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో పూజలకు హాజరయ్యారు. ఆలయ అర్చకులుశ్రీకాళికాదేవి సమేత కాళభైరవ స్వామి, శ్రీ వాలీశ్వర స్వామి, శ్రీ మరగదాంబిగ అమ్మవారికి ఉదయం ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. పలు రకాల పుష్పాలతో విశేష అలంకారం చేశారు. మహిళలు ప్రమిదలు, గుమ్మడికాయలతో నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదానం చేశారు. ఇది పల్లవుల కాలం నాటి ప్రాచీన ఆలయం కావడం ఆలయంలో క్షేత్రపాలకునిగా కాలభైరవ స్వామి కొలువై ఉన్నారు. ప్రతి 15 రోజులకోసారి వచ్చే అష్టమి పూజలకు పెద్ద సంఖ్యలో భక్తులు రావడం పరిపాటి. ఏర్పాట్లను ఆలయ ప్రధాన అర్చకులు శంకర్ రాజ్ గురుక్కళ్, సిబ్బంది పర్యవేక్షించారు.

13 నుంచి ఆండాళ్ తిరుపవడిపురం ఉత్సవం

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో 13వ తేదీ నుంచి 22 వరకు ఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా ప్రతిరోజూ ఉదయం ఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం, సాయంత్రం ఆస్థానం నిర్వహిస్తారు. చివరి రోజైన ఈనెల 22వ తేదీన అమ్మవారి శాత్తుమొర సందర్భంగా ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు గోవిందరాజస్వామి వారు, ఆండాళ్ అమ్మవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు గోవిందరాజస్వామి, ఆండాళ్ అమ్మవారిని అలిపిరికి ఊరేగింపుగా తీసుకెళతారు.

పిల్లలను బడిలో చేర్చండి


బండారుపల్లె ఎస్టీ కాలనీలో బడిఈడు పిల్లలను గుర్తిస్తున్న సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు

ఏర్పేడు: బడిఈడు పిల్లలను బడిలో చేర్చాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం కోరారు. సోమవారం మండలంలోని బండారుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో మన్నసముద్రం, బండారుపల్లె ఎస్టీ కాలనీలలో బడిఈడు పిల్లల గుర్తింపు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నారన్నారు. మెనూ ప్రకారం రోజువారీ పౌష్టికాహారం పెడుతున్నామన్నారు. పేర్కొన్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, సురేష్, ఉమామహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు

తిరుపతి ఎడ్యుకేషన్: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో వందలోపు మూడు ర్యాంకులు సాధించిన నారాయణ విద్యాసంస్థ విద్యార్థులకు ఆ విద్యాసంస్థ భారీ నగదు బహుమతి అందజేసింది. శ్రీనివాసమంగాపురంలోని ఆ విద్యాసంస్థలో సోమవారం విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయి 34వ ర్యాంకు సాధించిన బాబు సుజన్‌రెడ్డికి రూ.5 లక్షలు, 71, 90వ ర్యాంకులు సాధించిన మిఖిల్, శశాంక్‌రెడ్డికి చెరో రూ.4 లక్షలు చొప్పున ఎండీ సింధూర, అకడమిక్ హెడ్ ప్రమీల, డీజీఎం కొండలరావు అందజేశారు.

12 నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

తిరుపతి రూరల్(చంద్రగిరి): గ్రామీణ మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ నెల 12వ తేదీ నుంచి నెలరోజులపాటు బ్యూటీషియన్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంకు గ్రామీణ ఉపాధి సంస్థ డైరెక్టర్ సురేష్ బాబు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పదోతరగతి ఉత్తీర్ణులై, తెల్లరేషన్ కార్డు ఉన్న 19 నుంచి 45 ఏళ్లలోపు మహిళలు శిక్షణకు అర్హులన్నారు. ఎంపికైన వారికి శిక్షణ సమయంలో ఉచితంగా భోజన వసతి కల్పిస్తున్నామని, రాకపోకలను బస్సు చార్జీలు సైతం అందించనున్నట్లు వెల్లడించారు. ట్రైనింగ్ పూర్తయిన తర్వాత సర్టిఫికెట్ అందజేయనున్నట్లు వివరించారు. ఆసక్తిగల వారు ఆధార్, రేషన్ కార్డు జిరాక్స్‌తోపాటు 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను తీసుకుని నేరుగా సంస్థ వద్దకు వచ్చి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఒక్కో బ్యాచ్‌కు 25 నుంచి 30 మందిని మాత్రమే తీసుకుంటున్నట్లు తెలిపారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకా నగర్, కొత్తపేట, చంద్రగిరి. 79896 80587, 94949 51289 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సాయంత్రానికి వచ్చేస్తామని తిరిగిరాని లోకాలకు..


పోస్టుమార్టం పూర్తయిన మృతదేహాలు


మృతదేహాలను తరలిస్తూ..


బ్యాగులను మృతుల కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: సాయంత్రం వేళకు ఇంటికి చేరుకుంటామని ఫోన్ చెప్పిన తమ కుటుంబ సభ్యులు గంటల వ్యవధిలో విగత జీవులవుతారని కలలో కూడా ఊహించలేదని మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం స్థానిక ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద కన్నీరుమున్నీరయ్యారు. గుండెలవిసేలా రోదించారు. వారి రోదనలు పలువురికీ కంటతడి పెట్టించింది. ఆదివారం మిట్టకండ్రిగ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విజయవాడ వాసులు ఆరుగురు మృత్యువాత పడటం విదితమే. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను స్వస్థలాలకు తరలించారు. తమ అమ్మానాన్న మరణాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని రేవంత్ విషణ్ణవదనంతో చెప్పాడు. తన తమ్ముడు భరత్ ఎవరు లేని అనాథగా మిగిలాడని ఆవేదన చెందాడు. తిరుమలకు శుక్రవారం బయలుదేరిన తన తండ్రి రమేష్, తల్లి రాజ్యలక్ష్మి, పెద్దమ్మ శ్రీలతకు ఫోన్ చేయగా సాయంత్రానికి ఇంటికి వస్తామని చెప్పారని అయితే వారంతా రోడ్డు ప్రమాదంతో తిరిగిరాని లోకాలకు చేరుకోవడం తమ కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చిందని చెప్పారు.

నువ్వు కూడా వచ్చి ఉంటే బాగుండేది


జయరామ్

మేము తిరుమలకు చేరుకున్నాం.. దర్శనానికి వెళ్తున్నాం.. నువ్వు కూడా వచ్చి ఉంటే బావుండేది.. అని తన సోదరుడు రమేష్ ఫోన్ చేసి చెప్పాడని, అయితే ప్రమాదంలో కుటుంబం మొత్తం చనిపోయినట్లు ఆదివారం మధ్యాహ్నం సమాచారం అందడంతో హుటాహుటిన బయల్దేరి ఇక్కడికి వచ్చినట్లు జయరామ్ చెప్పారు. అవనిగడ్డ ప్రాంతం తమదని, తన అన్న రమేష్ విజయవాడలో స్థిరపడి కొడుకులను చదివించారని, భరత్ తల్లిదండ్రులను కోల్పోయినట్లు తెలియనివ్వలేదని, మృతదేహాలను స్వగ్రామాలకు తీసుకువెళ్తున్నట్లు చెప్పారు.

అక్షయ కోసం విద్యార్థుల నిరీక్షణ

ప్రమాదంలో మరణించిన నరసింహమూర్తికి బావ, రమణికి తమ్ముడు, అక్షయకు తాను మేనమామ అని శ్రీకాంత్ చెప్పారు. అక్షయ చదువుల్లో బాగా రాణిస్తోందని, చాలా చలాకీగా ఉండేదని ఆమె జ్ఞాపకాలను గుర్తు చేసుకుని విచలితులయ్యారు.


శ్రీకాంత్

వారి మృతదేహాలను విజయవాడకు కాకుండా గుడివాడకు తీసుకెళుతున్నామన్నారు. విద్యార్థులు అక్షయను చివరిసారిగా చూడాలని కోరడం వల్ల కళాశాలకు మృతదేహం తీసుకెళ్లి అనంతరం గుడివాడకు వెళతామన్నారు.

ఇలాంటి ప్రమాదం నా జీవితంలో చూడలేదు


దిలీప్

ఇలాంటి ప్రమాదం తన జీవితంలో ఇప్పటివరకు చూడలేదని ఎస్ఎంఎస్ అంబులెన్స్ నిర్వాహకుడు దిలీప్‌బాషా చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నామని, తన స్నేహితులతో కలిసి మృతదేహాలను తీసుకువచ్చిన ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఆస్పత్రిలో ఫ్రీజర్లు లేకపోవడంతో తమ అంబులెన్సులోని ఫ్రీజర్లను ఇచ్చినట్లు ఆయన చెప్పారు.

పరిశోధనలతో సమస్యలకు పరిష్కారం


పరిశోధక విద్యార్థినులతో మహిళా వర్సిటీ వీసీ

తిరుపతి ఎడ్యుకేషన్: సమాజంలోని క్లిష్టమైన సమస్యలకు పరిశోధనలతోనే పరిష్కారం లభిస్తుందని పద్మావతి మహిళా వర్సిటీ వీసీ డి.భారతి తెలిపారు. వర్సిటీలో ఏడు రోజులుగా హైదరాబాదుకు చెందిన ఐసీఎస్ఎస్ఆర్ రీజనల్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీసెర్చ్ మెథడాలజీ వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. వీసీ మాట్లాడుతూ అన్ని సమస్యలకు పరిష్కారం ఉంటుందన్నారు. దాని కోసం సమయం కేటాయించి ఆలోచనలకు పదును పెట్టాలని తెలిపారు. విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని సూచించారు. ఐసీఎస్ఎస్ఆర్ కన్సల్టెంట్ జాకబ్ మాట్లాడుతూ రీసెర్చ్‌లో ఎథిక్స్ ఎంతో ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయలక్ష్మి, ఉమ, అనూరాధ, ఇందిర, మాధవి, నీరజ, శ్రీరజిని, రూప, లత, వజీహ పాల్గొన్నారు.

టీటీడీ సహకారంతో రోడ్ల సేఫ్టీకి చర్యలు

తిరుపతి తుడా: టీటీడీ సహకారంతో తిరుపతి నగరంలోని రోడ్ల సేఫ్టీకి చర్యలు తీసుకుంటామని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత తెలిపారు. ఆమె సోమవారం రోడ్ల నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ నగరంలోని తొమ్మిది రోడ్లు టీటీడీ పరిధిలో ఉన్నాయన్నారు. వాటిలో సేఫ్టీ విషయమై టీటీడీ ఇంజినీర్లతో కలిసి చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. శ్రీనివాస సేతు, శ్రీనివాసం వద్ద దిగే వాహనాలు వేగంగా వస్తుండడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. అదే ప్రాంతంలో శ్రీనివాసం మాధవం అతిథి గృహాల్లోకి ఎంట్రీ ఉండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందన్నారు. టీటీడీ అధికారులతో సమన్వయం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కమిషనర్, డిప్యూటీ కమిషనర్, ఎస్ఈ పాల్గొన్నారు.